క్లుప్తంగా

ముగిసిన దస్తగిరి స్వామి ఉరుసు


జొన్నగిరిలో షంషీర్‌ను ఊరేగిస్తున్న దృశ్యం

తుగ్గలి : మండలంలోని జొన్నగిరిలో హజరత్ మహబూబ్ సుభాన్ దస్తగిరిస్వామి, హజరత్ మౌలాలి స్వామి ఉరుసు సోమవారం ముగిసింది. వేకువజామున ప్రత్యేక ప్రార్థనల అనంతరం స్వామి షంషీర్‌ను గుర్రంపై ఉంచి మేళ తాళాలతో గ్రామంలో ఊరేగించారు. కులమతాలకు అతీతకంగా భక్తులు స్వామికి చక్కెర చదివింపులు చేసి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

వరి కోతలు వాయిదా వేసుకోండి

కృష్ణగిరి: ఈ నెల 11వ తేదీ నుంచి తుపాన్ ప్రభావం ఉంటుందని దీంతో వరి కోతలను రైతులు వాయిదా వేసుకోవాలని ఏఓ వెంకటేశ్వర్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తుపాన్ ప్రభావం జిల్లాపై ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. రైతులు ముందు జాగ్రత్తగా వరి కోతలను వాయిదా వేసుకోవాలని, పంట కోసిన రైతులు కుప్పలుగా వేసుకుని టార్పాలతో కప్పుకోవాలని సూచించారు.

వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలి

ఆలూరు రూరల్: మండలంలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలని ఈఓపీఆర్డీ ప్రభాకర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. బహిరంగ మలవిసర్జన వల్ల అనారోగ్యం బారిన పడతారన్నారు. ప్రస్తుతం చాలా గ్రామాల్లో ఉన్న మరుగుదొడ్లలో వంట చెరుకు, గోనె సంచులు ఉంచుతున్నారని చెప్పారు. మన ఆరోగ్యం మనచేతుల్లోనే ఉందన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లు ఉపయోగించుకోవాలని సూచించారు.

భూసార ఫలితాల పత్రాల పంపిణీ


భూసార పరీక్షా పత్రాలను అందజేస్తున్న ఏడీఏ మోహన్‌విజయ్‌కుమార్

దేవనకొండ: స్థానిక రైతుసేవా కేంద్రంలో సోమవారం భూసార పరీక్షల ఫలితాల పత్రాలను ఏడీఏ మోహన్ విజయ్‌కుమార్ రైతులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలానికి 285 కార్డులు వచ్చాయని, గ్రామాల వారీగా పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ కార్డుల ద్వారా రైతుల వివరాలు, ఏ పంటకు ఎంత ఫర్టిలైజర్ వినియోగించుకోవాలో కార్డులో పొందుపరిచారని వివరించారు. సూచించిన విధంగా రైతులు ఎరువులను వినియోగిస్తే మట్టిలో పోషకాల శాతం, వాటి సాంద్రత పెంపొందే అవకాశముంటుందని పేర్కొన్నారు. అలాగే.. మండలానికి ఇన్‌చార్జ్ వ్యవసాయ అధికారిణి మునెమ్మను నియమించారని చెప్పారు. ఏఈఓ రంగన్న, మల్లికార్జున, అబ్దుల్ సలాం, రంగాచారి, రైతులు పాల్గొన్నారు.

రక్తదానం


రక్తదానం చేస్తున్న ప్రజలు

హాలహర్వి: మండలంలోని జె.హొసళ్లి గ్రామంలో పట్టదయ్యస్వామి మఠంలో లక్ష దీపోత్సవ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామస్తులు, భక్తులు 30 మంది రక్తదానం చేశారు. వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


దాతలను సన్మానిస్తున్న గ్రామపెద్దలు

మద్దికెర:మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో శ్రీకృష్ణ దేవాలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన రిటైర్ట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఊటుకూరు విజయమోహన్‌రెడ్డి, స్వర్ణలతారెడ్డి కుమారుడు అనిల్‌కుమార్‌రెడ్డి, కుమార్తె అంజులతా రెడ్డి రూ.20 లక్షల విరాళం ప్రకటించారని దేవాలయ కమిటీ సభ్యులు రవికుమార్, శంకర్, గోపాల్ సోమవారం తెలిపారు. ఆలయ గోపురం నిర్మాణానికి అయ్యే మొత్తం ఖర్చును తామే భరిస్తామని దాతలు తెలిపారు. దీంతో గ్రామస్తులు వారిని ఘనంగా సన్మానించారు.

ఇంటిపైనే పవర్!

- సూర్యరశ్మి ద్వారా విద్యుత్ ఉత్పత్తికి పీఎం సూర్యఘర్ పథకం అమలు
- సోలార్ ప్యానల్‌తో పీఎం సూర్యఘర్ యాప్‌లో నమోదు
- సబ్సిడీతో పాటు రుణ సదుపాయం కల్పిస్తున్న ప్రభుత్వం
- 30 రోజుల్లో రాయితీ జమ
- కిలోవాట్ సోలార్ రూఫ్‌టాప్‌తో నెలకు దాదాపు 120 యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి
- డివిజన్‌లో 170 మంది నమోదు


మిద్దెపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెళ్లు

సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు సామర్థ్యం	ఉత్పత్తి అయ్యే యూనిట్లు (నెలకు)	ఏడాదికి ఆదా (సుమారు)	ప్రభుత్వ రాయితీ
1 కిలోవాట్	120 యూనిట్లు	రూ.8వేలు	రూ.30వేలు
2 కిలోవాట్లకు	240 యూనిట్లు	రూ.20వేలు	రూ.60వేలు
3 కిలోవాట్లకు	360 యూనిట్లు	రూ.32వేలు	రూ.78వేలు

పత్తికొండ(తుగ్గలి) : ఇంటి పైకప్పుపై సౌర పలకలను ఏర్పాటు చేసుకునడం ద్వారా విద్యుత్ బిల్లును తగ్గించుకునేందుకు కేంద్రప్రభుత్వం పీఎం సూర్యఘర్ పథకానికి శ్రీకారం చుట్టింది. ఒక్కో ఇంటిపై గరిష్ఠంగా మూడు కిలోవాట్లకు రూ.78వేల చొప్పున రాయితీ ఇస్తుంది.

సబ్సిడీ..

పీఎం సూర్యఘర్ పథకం రాయితీ కింద ఒక కిలోవాట్‌కు రూ.30వేల సబ్సిడీని కేంద్రం చెల్లిస్తుంది. రెండు కిలోవాట్లకు రూ.60వేలు, మూడు కిలోవాట్లకు రూ.78వేలు మాత్రమే అందిస్తుంది. మూడు కిలోవాట్ల రూఫ్‌టాప్ సోలార్‌ను ఏర్పాటు చేసుకోవడానికి రూ.1.45 లక్షలు ఖర్చయితే అందులో కేంద్రం కేవలం రూ.78 వేలు మాత్రమే భరిస్తుంది. మిగిలిన మొత్తాన్ని పూచీకత్తు అవసరం లేకుండా తక్కువ వడ్డీకే బ్యాంకుల రుణాలు పొందవచ్చు.

ఎవరికి ఎంత కెపాసిటీ..

0–150 యూనిట్ల విద్యుత్ వినియోగించే వారికి 1–2కిలోవాట్ల రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటు చేసుకుంటే సరిపోతుందని అధికారులు పేర్కొంటున్నారు. 150–300 యూనిట్ల విద్యుత్‌ను వినియోగించు వారు. 2–3 కిలోవాట్ల రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. 300 యూనిట్లు పైన వాడే వారు 3కిలోవాట్, ఆపైన సామర్థ్యం ఉండే రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. 3కిలోవాట్లకు మించి సోలార్ వ్యవస్థ ఏర్పాటు చేసుకున్నా.. గరిష్ఠంగా రూ.78వేల సబ్సిడీ మాత్రమే చెల్లిస్తారు. మిగులు విద్యుత్‌ను నెట్‌మీటర్ ద్వారా విక్రయించుకోవచ్చు.

ఆదా ఇలా..

ఒక కిలోవాట్‌కు సుమారు 120 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఈ యూనిట్లకు ప్రస్తుత బిల్లు ప్రకారం నెలకు రూ.వెయ్యి వస్తుంది. అదే సోలార్ ద్వారా అయితే..రూ.338 మాత్రమే అవుతుంది. దీంతో ఏటా రూ.8వేలు ఆదా అవుతుంది. అదే నెలకు 240 యూనిట్లు వినియోగించే వారికైతే నెలకు రూ.2వేలకు బిల్లు వస్తుందనుకుంటే.. సోలార్ వ్యవస్థ వల్ల రూ.333 మాత్రమే ఖర్చు అవుతుంది. 360 యూనిట్లు వినియోగించే వారికి ఏటా రూ.32వేల వరకు ఆదా అవుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

దరఖాస్తు ఇలా..

పీఎం సూర్య ఘర్ యోజన పథకం వర్తించేందుకు పీఎం సూర్యఘర్ యాప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. అందులో పూర్తి వివరాలు పూరించాలి. ఆరు నెలలుగా కరెంటు బిల్లు కాపీని అందులో అప్‌లోడ్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. తదుపరి ట్రాన్స్‌కో అనుమతులు పొందాక వెండర్లను ఎంపిక చేసుకోవాలి. ఇందులో కిలో వాట్‌కు నిర్ణయించిన దానికి ప్రకారం సబ్సిడీ ఇస్తారు. మిగిలిన మొత్తానికి బ్యాంకు రుణ సదుపాయం కల్పిస్తారు. తదుపరి ఇంటి రూఫ్‌పై వంద చదరపు అడుగుల స్థలంలో సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం వాడుతున్న మీటర్‌ను తొలగించి వాటి స్థానంలో నెట్ మీటర్‌ను అమరుస్తారు. దీంతో సోలార్ ద్వారా వస్తున్న ఉత్పత్తి, వినియోగదారుడు వాడుతున్న విద్యుత్‌ను బేరీజు చేస్తారు.

బ్యాంక్ ఖాతాలో రాయితీ జమ..

నెట్ మీటర్ అమర్చిన తర్వాత వినయోగదారుడు పోర్టల్‌లో బ్యాంకు ఖాతా వివరాలను అప్‌లోడ్ చేస్తే సబ్సిడీ 30 రోజుల్లో చెల్లిస్తారు. ఒకకిలో వాట్ రూఫ్‌టాప్ కెపాసిటీ కోసం 3–4 ప్యానల్స్ 1 మీటరు వెడల్పు, 1–6 మీటర్ల ఎత్తు కొలతలతో అమర్చుతారు. ఒక కిలోవాట్ సోలార్ రూఫ్‌టాప్ ప్యానెల్ నెలకు దాదాపు 120 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. వినియోగదారుడు డిస్కమ్ నుంచి కనీస విద్యుత్ బిల్లులను పొందుతారు. సోలార్ రూఫ్ టాప్ ప్యానెళ్లు సూర్యుని వేడిని పీల్చుకోవడం వల్ల ఇల్లు చల్లగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. వినియోగదారుడు ఆరేళ్లలోపు పెట్టిన పెట్టుబడిని తిరిగి పొందవచ్చని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



సోలార్ విద్యుత్‌పై అవగాహన కల్పిస్తున్నాం. ప్రభుత్వం రాయితీ, రుణ కూడా సదుపాయం కల్పిస్తోంది. 6ఏళ్లలో పెట్టిన పెట్టుబడి తిరిగి పొందవచ్చు. నెట్ మీటర్ విధానం ద్వారా విద్యుత్ ఉత్పత్తి, వాడకం తెలుసుకోవచ్చు. ఇప్పటి వరకు మొత్తం 170 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. వాటిలో పది చోట్ల సోలార్ రూఫ్ టాప్‌లు బిగించాం. సందేహాలు ఉంటే విద్యుత్‌శాఖ ఏఈలను సంప్రదించాలి. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– డి ఖాజావలి, ట్రాన్స్‌కో ఏడీఈ, పత్తికొండ

జింకల బారి నుంచి రక్షించాలి

ఆస్పరి: మండలంలో జింకల బారి నుంచి పంటలను రక్షించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి బాలకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడడుతూ వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేస్తే జింకలు పంటలపై దాడి చేసి రైతులను తీవ్రంగా నష్టపరుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జింకల కోసం దేవరగట్టు కొండల్లో జింకల పార్కు ఏర్పాటు చేయాలని కోరారు. సాగు నీటి సౌకర్యం లేని ఆస్పరి మండలానికి వేదావతి, హంద్రీనీ నీవా నుంచి సాగు,తాగు నీరు అందించాలన్నారు. సీపీఎం నాయకులు హనుమంతు, రంగస్వామి, రామాంజనేయులు,రవి, ఈరన్న, పెద్దవీరభద్రి పాల్గొన్నారు.

ఈరన్నస్వామికి ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న ఈరన్నస్వామి

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహామంగళ హారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. కొందరు భక్తులు తమ మొక్కులను తీర్చుకునేందుకు దేవాలయ ఆవరణలో పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


పెద్దహోతూరు గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ దిలీప్ కుమార్

ఆలూరు రూరల్: సైబర్ నేరాలపై గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ దిలీప్ కుమార్ సూచించారు. సోమవారం సాయంత్రం మండలంలోని పెద్దహోతూరు గ్రామంలో సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తుల ఫోన్ నంబర్లకు ఓటీపీలు,అకౌంట్ నంబర్లు, ఏటీఎం కార్డు వివరాలు చెప్పరాదని సూచించారు. మోసపోయిన పది నిమిషాల్లోనే పోలీసులకు సమాచారం అందించి అపరిచిత వ్యక్తుల ఫోన్ నంబర్ చెప్పాలన్నారు. స్కూటర్‌పై ప్రయాణించే వారు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలచి కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అతి వేగంగా వాహనం నడిపి ప్రమాదాల బారిన పడవద్దని చెప్పారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి


తహసీల్దార్ నజ్మాబానుకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

హాలహర్వి: ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తయినా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడం లేదన్నారు. రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇస్తామని చెప్పి ఖరీఫ్, రబీ సీజన్ పూర్తయినా నేటికీ అందించకపోవడం దుర్మార్గమన్నారు. ఆర్థిక సాయం అందక రైతులు పంటల సాగుకు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే మిర్చి పంటకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ నజ్మాబానుకు వినతి పత్రం అందించారు. రైతు సంఘం నాయకులు ఎర్రిస్వామి, నాగరాజు, శివప్ప, రైతులు పాల్గొన్నారు.

రైల్వే నిర్మాణ పనులు నిలిపివేయండి


పనులను ఆపాలని రైల్వే అధికారులతో మాట్లాడుతున్న చాకిబండ గ్రామస్తులు

హాలహర్వి: మండలంలోని చాకిబండ గ్రామంలో జరుగుతున్న రైల్వే అండర్ బ్రిడ్జి పనులను వెంటనే ఆపాలని సర్పంచ్ ఓబుళపతి, గ్రామస్తులు రైల్వే అధికారులను అడ్డుకున్నారు. సోమవారం రైల్వే పనుల వద్దకు చేరుకుని గ్రామస్తులు ధర్నాకు చేపట్టి, అధికారులతో వాగ్వాదానికి దిగారు. గ్రామ శ్మశానంలో పనులు చేపట్టడం వల్ల గ్రామానికి శ్మశానం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పురాతన కాలం నుంచి ఇక్కడే శ్మశానవాటిక ఉందని, అధికారులు స్పందించి ఇక్కడ పనులు చేపట్టవద్దని విజ్ఞప్తి చేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

దేవనకొండ: విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మధు, భాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ బకాయిలు పెండింగ్‌లో ఉండడంతో ఫీజులు చెల్లించలేక, పై చదువులకు అవసరమైన ధ్రువ పత్రాల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. నాయకులు రవితేజ, జవీద్, నరేష్, అజీమ్, శేఖర్, రఫీ, సంతోష్, తేజ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యకరం


ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిన కూరగాయలు కొనుగోలు చేస్తున్న తహసీల్దార్ రమాదేవి

తుగ్గలి : ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే ఆకుకూరలు, కూరగాయలు ఆదాయం, ఆరోగ్యం ఇస్తాయని తహసీల్దార్ రమాదేవి అన్నారు. వ్యవసాయశాఖ– రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి సేద్యంతో పండిన కూరగాయలు, ఆకుకూరలను స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉంచి విక్రయించారు. తహసీల్దార్ మాట్లాడుతూ..అన్ని రకాల సేద్యాల కన్నా ప్రకృతి సేద్యం ఆరోగ్యకరమైనదని, సురక్షితమైనదని తెలిపారు. రైతులంతా ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలని కోరారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వాడటం వల్ల వాతావరణంలో కాలుష్యం, భూమిలో రసాయన పదార్థాలు నిండి పోతున్నాయన్నారు. ఫలితంగా మనుషులకు అనారోగ్యం, అంతుచిక్కని రోగాలు వస్తున్నాయని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ మండల యాంకర్ లింగప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ కూరగాయలనే వాడాలి

మద్దికెర : క్రిమిసంహారక మందులు వాడుతుండడంతో జబ్బుల బారిన పడుతున్నామని, ఆరోగ్యంగా ఉండాలంటే సేంద్రియ ఎరువులతో పండించిన పంటలను వాడాలని తహసీల్దార్ హుసేన్‌సాహెబ్ అన్నారు. సోమవారం రైతుసాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన కాయగూరలను కొనుగోలు చేసి అందరినీ ప్రోత్సహించారు. డీటీ శ్రీదేవి, ఆర్‌ఐ రవికుమార్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత




భక్తులకు దైవ సందేశాన్ని వినిపిస్తున్న జగద్గురు మల్లికార్జున విశ్వ ఆరాధ్య శివాచార్య భగవత్పాదం, హాజరైన భక్త జనం, పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే విరూపాక్షి

హాలహర్వి/ఆలూరు: ఆధ్యాత్మిక భావాలతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని కాశీ నుంచి వచ్చిన శ్రీమద్ కాశీ జ్ఞాన సింహాసనాదీశ్వర 1008 జగద్గురు డా.మల్లికార్జున విశ్వ ఆరాధ్య శివాచార్య భగవత్పాదం అన్నారు. మండలంలోని జె.హొసళ్లి గ్రామంలో సోమవారం శ్రీ పట్టదస్వామి మఠంలో లక్ష దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆయన హాజరయ్యారు. శివాచార్య దర్శనం కోసం ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆయా గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి లక్ష దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా 1,100 మంది ఆడపడుచులకు ఒడిబియ్యం కార్యక్రమం చేపట్టారు. మఠం పట్టదస్వామి పరమపూజ్య శంభులింగస్వామి, పరమపూజ్య డా.మహేశ్వర మహాస్వామి పాల్గొన్నారు.

వైభవంగా ఊంజల సేవ


స్వామివారికి ఊంజల సేవ నిర్వహిస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీ మెయిన్ బజార్ రామాలయం శతాబ్ది బ్రహ్మోత్సవాల్లో భాగంగా సీతారాముల వారికి ఊంజల సేవను వైభవంగా నిర్వహించారు. సోమవారం ఆలయంలో వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమాచార్య ప్రాజెక్ట్ వారు నిర్వహించిన భక్తి సంగీత విభావరి అలరించింది.విష్ణు సహస్రనామ సత్సంగం, భరతమాత దేవాలయం బృందం ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, శ్రీమద్ భగవద్గీతలోని పదవ అధ్యాయం విభూతి యోగాన్ని భక్తులు సామూహికంగా గానం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ కోశాధికారి చిలుకూరి నంద కిశోర్ మాట్లాడుతూ.. ఆలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమై వంద సంవత్సరాలు అవుతున్న నేపథ్యంలో ఆలయానికి పునర్వైభవం తీసుకొచ్చేందుకు పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు.

12న గొర్రెల పెంపకందారుల యూనియన్ సమావేశం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ సర్వసభ్య సమావేశం ఈ నెల 12న జరుగనుందని కార్యనిర్వాహక సంచాలకులు డాక్టర్ సుభాన్‌బాష తెలిపారు. యూనియన్ అధ్యక్షుడు కే.ఏ శ్రీనివాసులు అధ్యక్షతన కొండారెడ్డి బురుజు సమీపంలోని బహుళార్థ పశువైద్యశాల ప్రాంగణంలోని సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనియన్ కార్యవర్గ సభ్యులు, జిల్లాలోని ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘం అధ్యక్షులు పాల్గొంటారని వెల్లడించారు.

నాటక కళాకారుడి మృతి


సుకువాయి మల్లి కార్జున గౌడ్ (ఫైల్)

హొళగుంద: కన్నడ నాటక రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన సుకువాయి మల్లికార్జునగౌడ్ (62) ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. కొద్ది రోజులుగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయన కర్నూలులో కోలుకోలేక మృతి చెందారు. సుకువాయి గ్రామానికి చెందిన ఈయన కొన్నేళ్లుగా భార్యతో కలిసి హొళగుందలో నివాసం ఉంటున్నాడు. ఈయన అనేక పౌరాణిక, సామాజిక నాటకాల్లో వివిధ పాత్రలతో కళాభిమానులను అలరించారు. ఈయన మృతి పట్ల పలువురు కళాకారులతో పాటు గ్రామ మాజీ సర్పంచ్ రాజ పంపన్నగౌడ్, చిన్నహ్యాట శేషగిరి, ఆలూరు బీజేపీ ఇన్‌చార్జ్ వెంకటరాముడు, బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు చిదానంద, మండలధ్యక్షుడు కెఎస్ ప్రసాద్ సంతాపం తెలిపారు.

ఎడవలిలో నేడు రెవెన్యూ సదస్సు

మద్దికెర : మండలంలోని ఎడవలి గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తామని, రైతులు తమ భూసమస్యలపై అర్జీలను అందజేయాలని తహసీల్దార్ హుసేన్‌సాహెబ్ సోమవారం తెలిపారు. రైతులు అందజేసిన దరఖాస్తులను పరిశీలించి ప్రభుత్వ రికార్డుల ప్రకారం సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ అదాలత్

మంత్రాలయం : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం మంత్రాలయంలో విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో డీఈ విజయరాజు తెలిపారు. స్థానిక విద్యుత్ కార్యాలయంలో రిటైర్డు న్యాయమూర్తి శ్రీనివాస ఆంజనేయస్వామి అధ్యక్షతన పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామన్నారు. ఏపీఎస్‌పీడీసీఎల్ (తిరుపతి) ఆధ్వర్యంలో మంత్రాలయంలో వేదిక ఏర్పాటు చేశామన్నారు. సదస్సులో విద్యుత్ వినియోగదారుల నుంచి దీర్ఘకాలిక సమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తారని చెప్పారు. అదాలత్‌లో అక్కడికక్కడే పరిష్కారం లభిస్తోందని, వినియోగదారులు వేదికను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. వేదికలో జిల్లా, ఎమ్మిగనూరు డివిజన్ వ్యాప్తంగా అధికారులు హాజరవుతున్నట్లు వివరించారు.

కోసిగి: మంత్రాలయం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వారి కార్యాలయంలో ఎమ్మిగనూరు డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు కోసిగి విద్యుత్ శాఖ ఏఈ వీరేష్ సోమవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు పరిష్కారం కాని సమస్యలను రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే పరిష్కరిస్తాని చెప్పారు.

జయప్రదం చేయండి

కోసిగి: అనంతపురంలోని అంబేడ్కర్ భవనంలో ఈనెల 14, 15వ తేదీలలో నిర్వహిస్తున్న మానవ హక్కుల వేదిక (హెచ్‌ఆర్‌ఎఫ్) తెలుగు ఉమ్మడి రాష్ట్రాల 10వ మహాసభలను జయప్రదం చేయాలని హెచ్‌ఆర్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు యూజీ శ్రీనివాసులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవేంద్రబాబు, జిల్లా అధ్యక్షుడు కె. ఉరుకుందప్ప పిలుపునిచ్చారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని అన్నీ వర్గాల ప్రజలు, విద్యార్థులు, యువజనులు, మహిళలు, కార్మికులు, కర్షకులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి మహా సభలను విజయవంతం చేయాలని కోరారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి


డిప్యూటీ తహసీల్దార్ రామేశ్వరరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

ఆస్పరి: కూటిమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని సీపీఐ మండల కార్యదర్శి విరుపాక్షి డిమాండ్ చేశారు. సోమవార స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎందుట సీపీఐ నాయకులు ధర్నా కార్యక్రమం చేపట్టారు. విరుపాక్షి మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు విద్యుత్ ధరలు పెంచమని చెప్పి పదవిలోకి వచ్చిన తరువాత చార్జీలు పెంచడం దుర్మార్గమన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రామేశ్వరరెడ్డికి వినతి పత్రం అందజేశారు. నాయకులు బ్రహ్మయ్య,కృష్ణమూర్తి, ఉరుకుందప్ప, రామాంజనేయులు, మహానంది, దస్తగిరి, హనుమంతు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల భారాన్ని ఉప సంహరించుకోవాలి

హొళగుంద: పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఆలూరు ఇన్‌చార్జ్ చిప్పగిరి లక్ష్మీ నారాయణ డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ కార్యకర్తలతో కలిసి హొళగుంద తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండ ఏకపక్షంగా ట్రూఅప్ విధించడం చట్ట విరుద్ధమన్నారు. అనంతరం తహసీల్దారు సతీష్‌కు వినతి పత్రం అందజేశారు. అలాగే సోనియాగాంధీ బర్త్ డేను జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు లింగంపల్లి రామాంజనేయులు, అమాన్, ఖాదర్, మంజునాథ్ పాల్గొన్నారు.